మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# కనెక్టివిటీ రోడ్లకు ఆమోదం తెలుపండి

- 24పంచాయతీలకు ప్రతిపాదనలు
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 18,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని నారాయణపేట జిల్లా మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కనెక్టివిటీ లేని గ్రామాలను అనుసంధానం చేయుట కోసం పెండింగ్లో ఉన్న పనులకు ఆమోదం కోసం ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కొరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం పార్లమెంట్ భవనంలోని మంత్రి ఛాంబర్ లో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ఎంపీ డీకేఅరుణ సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో పీఎంజీఎస్వై కింద 24 గ్రామ పంచాయతీలను గుర్తించి గతంలో ప్రతిపాదన సమర్పించారు.వీటిలో 13 గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లకు ఇప్పటికే డీపీఆర్ తయారీ కోసం ఎన్ఆర్ఐడీఏ ఆమోదించింది. మిగిలిన 11 గ్రామాలకు సంబంధించి కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆమోదం పెండింగ్ లో పెట్టింది..మక్తల్ నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతం,రోడ్ల కనెక్టివిటీ లేకపోవడం వల్ల ఆయా గ్రామాలలో నివసించే ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతం యొక్క సామాజిక ఆర్థిక అభివృద్ధికి రోడ్ల కనెక్టివిటీ చాలా కీలకం.అందువల్ల మిగిలిన 11 గ్రామాలకు వీలైనంత త్వరగా ఎన్ఆర్ఐడీఏ ఆమోదం తెలపాలని, మక్తల్ నియోజకవర్గంలోని మొత్తం 24 గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లకు సంబంధించిన డిపిఆర్ తయారీని ప్రారంభించాలని, సంబంధిత అధికారులను ఆదేశించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను ఎంపీ డీకే అరుణ కోరారు.


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ

# ధాన్యం దించుకున్న మిల్లర్లు వెంటనే రశీదు పంపించాలి

**సివిల్ సప్లై అధికారులు సూచించిన మిల్లులకు మాత్రమే ధాన్యం పంపించాలి : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**


వరి కొనుగోలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్

**వనపర్తి, డిసెంబరు18 ప్రభాతవార్త:** కష్టపడి ధాన్యం పండించిన రైతులకు సకాలంలో డబ్బులు వారి ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా సహకార సంఘం, సివిల్ సప్లై అధికారులతో వరి కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొన్నాము, ఇంకా ఎంత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావాల్సి ఉంది, ఇప్పటి వరకు ఎంతమంది రైతుల ఖాతాల్లో డబ్బులు అయ్యాయి అనే వివరాలను సమీక్షించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1.87 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇంకా మరో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ కొనుగోలు చేసిన ధాన్యంలో ఇంకా దాదాపు 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ట్యాబ్ ఎంట్రీ పెండింగ్ లో ఉందని, మిల్లర్లు దించుకున్న ధాన్యానికి సంబంధించి వెంటనే రశీదు పొంచాలని సూచించారు. మిల్లర్లు రశీదు ఇవ్వకపోవడం వల్ల ట్యాబ్ ఎంట్రీ కాకుండా రైతులకు డబ్బులు చెల్లించలేకపోతున్నామని తెలిపారు. మిల్లర్ల నుండి రశీదు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు తూకం చేసిన ధాన్యాన్ని తమకు ఇష్టం వచ్చిన మిల్లుకు పంపించడానికి వీలు లేదని, సివిల్ సప్లై అధికారి సూచించిన మిల్లుకు మాత్రమే ధాన్యం పంపించాలని చెప్పారు. అలా జరగని పక్షంలో అట్టి ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ చేయవద్దని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్, పిడి డీఆర్డిఓ ఉమాదేవి, జిల్లా సహకార సంఘం అధికారి ఇందిరా, జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డియం. జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నివీర్ సైనికులను సన్మానించిన జిల్లా కలెక్టర్

**వనపర్తి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** యూనియన్ బ్యాంక్‌లో క్లర్క్ ఉద్యోగం చేస్తూ వనపర్తి జిల్లాలోని యువతకు అగ్నివీర్ ఉద్యోగాల్లో ఎంపికయ్యే విధంగా ఉచిత శిక్షణ ఇస్తున్న మాజీ సైనికుడు గబ్బర్ సింగ్ ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అభినందించారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో గబ్బర్ సింగ్ తో పాటు అగ్నివీర్ కు ఎంపిక అయిన 8 మంది యువకులను శాలువాతో సన్మానం చేసి అభినందించారు. అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపిక అయిన యువత, ఇప్పటికే 6 నెలల శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన సైనికులను కలెక్టర్ అభినందించారు. గబ్బర్ సింగ్ ఆర్మీలో పని చేసి రిటైర్ అయిన తర్వాత పట్టణంలోని ఒక యూనియన్ బ్యాంక్ బ్రాంచిలో క్లర్క్ ఉద్యోగం చేస్తూ ప్రతి రోజు ఉదయం ఆసక్తి ఉన్న యువతకు సైన్యంలో చేరేందుకు ప్రోత్సహిస్తూ ఎంపికకు అవసరమైన శిక్షణను ఉచితంగా ఇస్తున్నారు. ఇప్పటి వరకు గబ్బర్ సింగ్ వద్ద శిక్షణ పొంది 110 మంది సైన్యంలో ఉద్యోగాలు పొందినట్లు కలెక్టర్ కు వివరించారు. ఇప్పటి వరకు 7 బ్యాచ్ లు నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సైతం తనవంతు సహకారం అందించి అటవీ శాఖకు సంబంధించిన ఇకో పార్క్ లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పించడం పై ధన్యవాదాలు తెలిపారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అధికారి సుధీర్ కుమార్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, డిప్యూటీ ఎల్‌డియం సాయి, అగ్నివీర్ కు ఎంపికైన యువకులు పాల్గొన్నారు.


మాజీ సైనికుడు గబ్బర్ సింగ్‌ను, అగ్నివీర్ సైనికులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

**రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**


సర్పంచుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

**ఆత్మకూర్ డిసెంబర్ 18, పభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలో స్థానిక సంస్థలు ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేయాలని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు మరియు ఉప సర్పంచులు వార్డు మెంబర్లను రాష్ట్ర మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మక్తల్ నియోజకవర్గం వర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని ఎందుకు సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంసాధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతో పాటుగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచుల సైతం తన వద్దకు వచ్చి గ్రామాల అభివృద్ధి కోసం రాజకీయాల కతీతంగా పనిచేసేందుకు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం లో భాగంగా ఆత్మకూర్ మండలానికి తీరని అన్యాయం జరిగిన విషయాన్ని స్థానిక నాయకులు పదేపదే తన దృష్టికి తెస్తున్నారని అందులో భాగంగానే ఈనెల 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కృష్ణా నదిపై అదనపు బ్రిడ్జి నిర్మాణంతో పాటుగా ఉమ్మడి ఆత్మకూరు మండలానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లుగా ఆయన తెలిపారు. శంకుస్థాపనలకే పరిమితం కాకుండా పనులు పూర్తి చేయించుకునేందుకు ఆత్మకు చెందిన స్థానిక నాయకులతో పాటుగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు సైతం తనని ఎల్లవేళలా కలిసేందుకు అందుబాటులో ఉంటానని మంత్రి అన్నారు. ఆత్మకూర్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా సాధించేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని ఇందుకుగాను ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారుఎన్నికల సమయంలో -మిగతా4లో..

# బీఆర్ఎస్ వైపే ప్రజలు

- పంచాయతీ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం
- సీఎం ప్రచారం చేసిన జనాలు పట్టించుకోలేదు..
- జడ్చర్లలో 88 స్థానాల్లో సర్పంచుల విజయం
- కరెంట్ బిల్లు కోసం మిషన్ భగీరథ నీళ్లను ఫిల్టర్ చేయని చేతకాని ప్రభుత్వం
- బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి


సర్పంచులను సన్మానిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, డిసెంబర్18,ప్రభాతవార్త :** బిఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా 40 శాతానికి పైగా పంచాయతీ ఎన్నికల్లో సీట్లు సాధించిందని, ప్రజలు మా వైపే ఉన్నారనడానికి ఇదే నిదర్శనమని బిఆర్ఎస్ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు,మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి అన్నారు. కరెంట్ బిల్లు పెరుగుతుందని మిషన్ భగీరథ నీళ్లను ఫిల్టర్ చేయలేని చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్ అని మండిపడ్డారు. జడ్చర్ల నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్,వార్డు మెంబెర్స్‌ను సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగామాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూజడ్చర్లలో అధికార పార్టీ కంటే ఎక్కువ సీట్లు బీఆర్ఎస్ గెలిచిందన్నారు. కాంగ్రెస్ రెండేళ్లలో గ్రామాలకు నిధులుఇవ్వలేదు కానీ ఈరోజు తాము బలపరిచిన అభ్యర్థులను గెలిపించకపోతే నిధులు ఇవ్వమని మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయంలో చేసిన అభివృద్ధి పనులుకొనసాగించడంలో విఫలం అయిందని ఆరోపించారు. రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని నమ్మి ప్రజలు ఈ విజయం అందించారన్నారు. గ్రామాలకు రావాల్సిన నిధులు ఎవ్వరు ఆపలేరని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సర్పంచ్ లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు.అయినా ఎవ్వరు పార్టీ మారడం లేదన్నారు. ఇక చేసేదేమి లేకాంగ్రెస్ ఇండిపెండెంట్‌లను వారి ఖాతాలో వేసుకుంటుందని ఆరోపించారు. జడ్చర్ల నియోజకవర్గంలో గెలిచిన ఇండిపెండెంట్ లకు తమ మద్దతు ఉందన్నారు.కాంగ్రెస్ హయాంలో గ్రామాలు వెలవెల బోతున్నాయని -మిగతా4లో..

# 35 మంది టచ్‌లో ఉన్నారు

- కాంగ్రెస్ అభ్యర్థులు ఇచ్చిన హామీలన్నీ నావే అనుకుంటా
- సింగిల్‌గా పోటీ చేసినా సెంచరీ కొట్టాం
- జడ్చర్లలో 108 స్థానాలు గెలిచాం..
- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, డిసెంబర్18,ప్రభాతవార్త :** సర్పంచ్ ఏపార్టీకి చెందిన వ్యక్తి అయినా మంచి వాడైతే తాము దగ్గరకు తీస్తామని, కబ్జాలు చేసి ప్రజల్ని భయపెట్టాలని చూస్తే సహించబోమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. పంచాయితీ ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులను గ్రామ ఇంచార్జీలుగా చేస్తామని, ఎమ్మెల్యే నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో వారికే ప్రాధాన్యత ఇస్తానని ప్రకటించారు. పంచాయితీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గురువారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా 108 పంచాయితీల్లో కాంగ్రెస్ సర్పంచులు గెలిచారని, వారు కాకుండా గెలిచిన ఇతర సర్పంచుల్లో మరో 35 మంది దాకా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతామంటూ తమకు టచ్ లోకి వచ్చారని వెల్లడించారు. 22న సర్పంచుల ప్రమాణ స్వీకారం అనంతరం గెలిచిన సర్పంచులకు సన్మానం చేస్తామని, ఆ తర్వాత ఈ విషయాలపై స్పష్టత వస్తుందని చెప్పారు. అయితే ఛస్తామని బెదిరించి, స్కూలుకు వెళ్లే పసి పిల్లలతో కాళ్లు -మిగతా4లో..

# సంక్షేమం, అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టారు

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**దేవరకద్ర, డిసెంబరు18 ప్రభాతవార్త:** సంక్షేమం, సామాజిక న్యాయం,అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. దేవరకద్ర మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో జిఎంఆర్ మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో 70% సర్పంచ్‌లను గెలిపించి, కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఎన్నికల తీర్పే నిదర్శనమని స్పష్టం చేశారు. ప్రజల ఆశయాలకుఅనుగుణంగా ప్రజాపాలన సాగుతుందని అనడానికి ఈ ఎన్నికల తీర్పే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల తీర్పుతో గ్రామ స్థాయిలో కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని, స్థానిక ప్రజలను కాంగ్రెస్ నేతలు మరింత నేరుగా కలిసే అవకాశం ఈ తీర్పుతో దక్కిందని పేర్కొన్నారు.అదేవిధంగా సర్పంచ్ ఎన్నికల్లో కలిసి పోటీచేసిన బిజెపి,బిఆర్ఎస్ పార్టీలకు ప్రజలు దిమ్మ తిరిగే తీర్పునిచ్చారన్నారు. ఈ ఎన్నికల ఫలితాలే రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి, మున్సిపాలిటీ ఎన్నికల్లో పునరావృతం అవుతాయని,రాష్ట్రంలో మరోసారి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, కౌకుంట్లమండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి, గ్రామ స్థానిక సర్పంచ్‌లు చెన్నకేశవులు, ఉషనప్ప, వెంకటేశ్వర్ రెడ్డి, గొల్ల కృష్ణయ్య, నరేష్ కుమార్, కాంతరెడ్డి, కుమ్మరి నాగమ్మ, శివకుమార్,అనంతమ్మరాజుగౌడ్, నవనీత శేఖర్ రెడ్డి, మచ్చందర్‌రెడ్డి, నరసింహులు, వివిధ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

# దేవరకద్ర పిహెచ్‌సిని ఆదర్శ ఆరోగ్య కేంద్రంగా తీర్చిదిద్దాలి

- ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి
- జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**దేవరకద్ర, డిసెంబరు 18 ప్రభాతవార్త:** దేవరకద్ర పీహెచ్‌సిని ఒక ఆదర్శ ఆరోగ్య కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి ఆదేశించారు. దేవరకద్ర మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిహెచ్‌సి) జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పిహెచ్‌సి ఆవరణ పరిశుభ్రత, రోగులకు అందుతున్న సౌకర్యాలు, గర్భిణీ మహిళల ఆరోగ్య సంరక్షణపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సాధించారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను మరింత మెరుగుపర్చాలని ఆమె ఆదేశించారు. గర్భిణీ మహిళలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, హిమోగ్లోబిన్ శాతం, నెలనెలా జరుగుతున్న వైద్య పరీక్షలవివరాలు అడిగి తెలుసుకున్నారు.హిమోగ్లోబిన్ తగ్గితే వచ్చే సమస్యలను వివరించి, పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందుతున్న గుడ్లు, పోషకాహారం సక్రమంగా వినియోగించుకోవాలని, ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని గర్భిణీ మహిళలకు కలెక్టర్ సూచించారు. అక్కడున్న వైద్య అధికారి (మెడికల్ ఆఫీసర్)తో మాట్లాడి ప్రతి నెల పిహెచ్‌సీలో జరుగుతున్న డెలివరీల సంఖ్య, ప్రతిరోజు ఎంత మంది అవుట్ పేషెంట్లు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్నారు. మందుల కొరత ఎమైనా ఉందా, తదితర వివరాలు అడిగి తెలుసుకన్నారు. తదనంతరం లేబర్ రూమ్‌ను పరిశీలించి అక్కడ అందుతున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.



పిహెచ్‌సికి వచ్చిన రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

**మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి:** దేవరకద్ర మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)ను జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అక్షయపాత్ర పథకం ద్వారా అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ భోజనం రుచి నాణ్యత పై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతోమాట్లాడుతూ వారిచదువు గురించి తెలుసుకున్నారు. ఏవైనా సబ్జెక్టులో ఇబ్బందులు ఉన్నాయా, సాయంత్రం స్నాక్స్ అందుతున్నాయా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో జరిగిన చర్చల్లో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి లో 89% ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడగగా పాఠశాల ప్రహరీ, సైన్స్ ల్యాబ్ సదుపాయాలు లేవని విద్యార్థులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ఈ సమస్యను పరిశీలించి, చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు పిహెచ్‌సి వైద్య అధికారి డా.శరత్, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

- రూ.11,08,250/- నగదు సీజ్ - 640 బైండోవర్
- పటిష్ట భద్రత, సిబ్బంది సమన్వయంతో సజావుగా నిర్వహణ
- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్18,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు ఎలాంటి చిన్న అవాంఛనీయ సంఘటనలు లేకుండా పూర్తిగా ప్రశాంతంగా, సజావుగా నిర్వహించబడినట్లు జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణకు మొత్తం 1249 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించి సమర్థవంతమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రతి అధికారి, సిబ్బంది కర్తవ్యనిష్ఠతో విధులు నిర్వర్తించినందుకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. అలాగే పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి ఎన్నికలు శాంతి యుతంగా జరిగేలా తోడ్పడిన జిల్లావాసులకు -మిగతా4లో..


పోలింగ్ కేంద్రం వద్ద ఎస్పీ జానకీ

## బిజెపి కార్యాలయం ఎదుట ధర్నా

**వనపర్తి ప్రతినిధి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** నేషనల్ హెరాల్డ్ పత్రిక పేరు మీద సోనియా గాంధీ,రాహుల్ గాంధీలపై అక్రమంగా పెట్టిన కేసులు ఢిల్లీ హైకోర్టు కొట్టేసిన సందర్భంగా ఏఐసీసీ,టీపీసీసీ పిలుపుమేరకు గురువారం వనపర్తి జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఉన్న బిజెపి కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి అధ్యక్షతన జరుగగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి, ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి ధర్నాలో పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్రం కోసం ఏర్పాటైన పత్రిక నేషనల్ హెరాల్డ్ పత్రిక అని స్వాతంత్రం తర్వాత ఇప్పుడుఆపత్రికకు యంగ్ ఇండియా అనిపెట్టారని తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరగకున్న గాంధీ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని అన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తూ,ప్రజలుఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తారని బిజెపిని మూడు సార్లు గెలిపించారని వారు గుర్తు చేశారు. అమిత్ షా ఇతర బిజెపి నాయకులు మాత్రం మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రాహుల్ గాంధీ ని టార్గెట్ చేస్తూకుట్రలు చేయడంఏంటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో బలిదానాలు జరుగుతుంటే తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా గాంధీ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేస్తే తెలంగాణ ప్రజలు ఎవరు సహించరని అన్నారు. ఈనాడు బిజెపి పార్టీ జైశ్రీరామ్ అంటుందని కానీ ఆనాడు మహాత్మా గాంధీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోరఘుపతి రాఘవ రాజారామ్‌అని రామ జన్మభూమి రావాలని కోరారు అని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్స్, సర్పంచులు,ఎస్సీ ,ఎస్టీ ,బీసీ ,మైనారిటీ మహిళ సోషల్ మీడియా యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ మత్స్యకార, వికలాంగుల, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ,ఎస్టీ ,విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్స్,ఐఎన్‌టియుసి కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఇప్పటికీ ఆదరణ తగ్గలేదు

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**మక్తల్ టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నియోజకవర్గంలో సగం సర్పంచ్ స్థానాలు బీఆర్ఎస్ గెలుచుకోవడం చాలా సంతోషకరమని అందుకు సర్పంచ్ ల ఎన్నికలే నిదర్శనమని అన్నారు.మక్తల్ పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు కాకపోవడాన్ని ప్రజలు పసిగట్టారని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు మంచి తీర్పునిచ్చారని అన్నారు.అనేక గ్రామాల్లో ఒకటి నుంచి 10, 20,30 ఓట్ల తేడాతో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి చెందారన్నారు. మక్తల్ మండలంలోని ముస్లాయిపల్లి పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిఒక ఓటు తేడాతో గెలుపొందాడన్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ మహిళనాలుగు ఓట్లు వేసినాఎన్నికల సిబ్బంది అభ్యంతరం చెప్పకపోవడం విడ్డూరం అని అన్నారు. పోలింగ్ ఏజెంట్లు, అక్కడి బీఆర్ఎస్ కార్యకర్తలు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని అన్నారు. ఆ ఎన్నికపై ప్రభుత్వంఎలక్షన్ కమిషన్ పునరాలోచించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. నాలుగు ఓట్లు దొంగ ఓట్లు వేయడం వల్లే అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ఒక ఓటు తేడాతో గెలుపొందారని తెలిపారు. లేదంటే మూడు ఓట్ల తేడాతో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించేవారన్నారు. గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేసిన ఉద్యోగాలను భర్తీ చేయడం తప్ప కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహ గౌడ్,కలాల్ రాజేష్ గౌడ్, పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చిన్న హనుమంతు, మాజీ వార్డ్ కౌన్సిలర్ మొగులప్ప, మన్నాన్, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హాకీ క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి,డిసెంబరు 18 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన అండర్ 14 బాలుర రాష్ట్ర స్థాయి హాకి క్రీడా పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికైన వనపర్తి జట్టు క్రీడాకారులను గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన 10జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయని, ఇందులో వనపర్తి జట్టు మొదటి స్థానంలో నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు మధ్యప్రదేశ్ లోని తిక్కగడ్ జిల్లా కేంద్రంలో నిర్వహించే జాతీయ స్థాయి హాకీ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్నట్లు వారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నత విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరం అని క్రీడల వల్ల జాతీయ అంతర్జాతీయ స్థాయిలో జన్మనిచ్చిన గ్రామానికి తల్లిదండ్రులకు, గురువులకు మన దేశానికే మంచి గుర్తింపు తీసుకురావచ్చునని ఆయన అన్నారు.జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

### డిసెంబర్ 21న జాతీయ లోక్ అదాలత్

## రాజీ మార్గమే రాజ మార్గం : జిల్లా ఎస్పీ



**గద్వాల టౌన్, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** రాజీ పడదానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో కక్షిదారులు ముందుకు వచ్చి రాజీ చేసుకుని, న్యాయపరమైన ఇబ్బందుల నుంచి విముక్తి పొందాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల డిసెంబర్ 21 ఆదివారం నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, క్షణికావేశంలో జరిగిన తప్పుల వల్ల అనవసరంగా కేసులు పెరిగి, వ్యక్తుల జీవితాలు, కుటుంబాలు ఇబ్బందుల పాలవుతున్నాయని తెలిపారు. ఇలాంటి సమస్యలకు లోక్‌అదాలత్ ఒక సమర్థవంతమైన పరిష్కార వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నమోదు అయి, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న, రాజీ కుదుర్చుకునే అవకాశం ఉన్న కేసులలో ఇరువర్గాలు పరస్పర అవగాహనతో ముందుకు వచ్చి రాజీ చేసుకోవాలని సూచించారు. జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ, వైవాహిక జీవితం సంబంధిత వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, విద్యుత్ చౌర్యం వంటి కేసుల్లో ఇరువర్గాల మధ్య రాజీకి అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా కేసులు సత్వరంగా పరిష్కారమై, సమయం, ధనం రెండూ ఆదా అవుతాయని ఎస్పీ సూచించారు.

## ఉపాధిహామీ చట్టంపై తీసుకున్న నిర్ణయాలు ఉపసంహరించుకోవాలి

### 200 రోజుల వరకు పని విధానాన్ని పెంచాలి

### ఐఎన్టీయూసీ జిల్లా ప్రతినిధులు

**మహబూబ్‌నగర్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** ఉపాధిహామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములుయాదవ్, ప్రధాన కార్యదర్శి ఎం.రాంమోహన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. పేదలు, కూలీలకు ఉపాధిహామీ పథకం జీవన ఆధారమని తెలిపారు. ఈ పథకంపై నిధుల కోతలు, పని తగ్గింపులు వంటి చర్యలు సరికాదన్నారు. పేదలకు ఉపాధి కోసం యూపీఏ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. కాని ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చడానికి ప్రయత్నిస్తుండడం దారుణమని తెలిపారు. ఈ పథకం కింద గ్రామాల్లోని కూలీలు, పేదల రోజు వారి పనిచేస్తూ జీవనం గడుపుతారని, ఈ చట్టంపై కోతలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధిహామీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని యధావిధిగా కొనసాగించడంతోపాటు 100 రోజుల పనిదినాన్ని 200 రోజులకు పెంచాలని కోరారు. కూలీ రేటు రూ.500 పెంచాలని, పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ వారు చేశారు.



మాట్లాడుతున్న రాములు యాదవ్

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

### ప్రజాసేవలోనే పరమార్ధం జెకె ట్రస్ట్ యాజమాన్యం

**నవాబుపేట, డిసెంబరు 18 ప్రభాతవార్త :** ప్రజాసేవలోనే పరమార్థం ఉందని జీకే ట్రస్ట్ యాజమాన్యం మేనేజింగ్ డైరెక్టర్ నరసింహ చారి అన్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన రావుల చంద్రయ్య ఇటీవల మరణించిన విషయం తెలుసుకుని కుటుంబానికి సానుభూతి తెలుపుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేలు, 25 కిలోల బియ్యం జేకే కుటుంబ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయము అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల స్థానిక సర్పంచ్ల ఎలక్షన్లో నవాబుపేట గ్రామ సర్పంచ్ గా జేకే ట్రస్ట్ డైరెక్టర్ గీతా రాణి సుధాకర్ అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. గ్రామ ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని అలాగే గ్రామ సేవలో ముందుండి ప్రజలకు ఎల్లవేళలా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని నవాబుపేట ప్రజలకు సేవ చేయడానికి మరింత బాధ్యత మాపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ప్రజా ప్రతినిధులు రంగారావు, జెకె టెస్టు యాజమాన్యం సభ్యులు ఆంజనేయులు, రావుల చంద్రయ్య కుటుంబ సభ్యులు, జెకే ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

## కన్మనూరు సర్పంచికి ఘనసన్మానం

### ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గద్వాల ఆంజనేయులు

**వనపర్తి, డిసెంబరు 18 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు గద్వాల ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో అడ్డాకుల మండలం కన్మనూరు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన మునగాల లక్ష్మి వెంకటస్వామికి ఘన సన్మానం నిర్వాహించారు. ఇటీవల నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకల్ మండలం కన్మనూరు గ్రామ సర్పంచిగా మునగాల లక్ష్మి వెంకటస్వామి గెలుపొందారు. ఈ సందర్భంగా సర్పంచిగా గెలుపొందిన మునగాల లక్ష్మి వెంకటస్వామి ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గద్వాల ఆంజనేయులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విజయం ప్రజలు మీ నాయకత్వంపై ఉంచిన నమ్మకమని దీని ద్వారా గ్రామాభివృద్ధికి మీరు చేసే సేవలు మరింత విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ మీ పూర్తి పదవి కాలాన్ని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గద్వాల ఆంజనేయులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ లక్ష్మికి సన్మానం చేస్తున్న దృశ్యం

## ఐఐటి టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయండి

### సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్

**వనపర్తి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 21న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే రామన్ టాలెంట్ టెస్ట్ ను విజయవంతం చేయాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక రేడియంట్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఒక బ్రోచర్ ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఐఐటి లాంటి శాస్త్ర సాంకేతిక విద్యపై విద్యార్థులు అత్యంత ఆసక్తిని చూపడం,దానికి తోడు తల్లిదండ్రులు సంపూర్ణంగా ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాయవచ్చని, గణిత, భౌతిక రసాయన శాస్త్ర సబ్జెక్టుల నుండి ప్రశ్నలుంటాయని శంకర్ గౌడ్ స్పష్టం చేశారు. వనపర్తి, మహబూబ్ నగర్, భూత్పూర్, కొత్తకోట, ఆత్మకూరు, పెబ్బేరు, గద్వాల, అయిజ, బిజినపల్లి మున్నగు చోట్ల పరీక్షా కేంద్రాలు ఉంటాయని ఆయన తెలిపారు. వివరాలకు 9347425998 నెంబర్‌ను సంప్రదించాలని, గెలుపొందిన విజేతలకు నగదు పారితోషికం అందజేయబడుతుందని చెప్పారు. కార్యక్రమంలో శ్రీ రామన్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు దేశి రాములు యాదవ్, బైరోజు చంద్ర శేఖర్, బండారు శ్రీనివాస్, గంధం నాగరాజు, గోపాలకృష్ణ, మహ్మద్ షఫీ, రాజేంద్ర ప్రసాద్, చారి, రమేశ్, మద్దిలేటి, నుస్రత్ , ముజీబా బేగం తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్

# అందరి సమన్వయంతోనే పంచాయతీ ఎన్నికలు విజయవంతం

**- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,**

**- జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,**

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఎన్నికల పరిశీలకులను సన్మానించిన అధికారులు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతోనే 3 విడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించగలిగామని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, ఎన్నికల పర్యవేక్షణకు కేటాయించిన ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీని కృతజ్ఞతలు తెలియజేస్తూ అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవలే నిర్వహించిన 20 మండలాల్లోని 453 పంచాయతీ ఎన్నికలు అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా ముగిశాయని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన అధికారుల కృషి అభినందనీయమని అన్నారు. వార్డు స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎన్నికల అధికారుల పాత్రపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఎన్నికల సమయంలో భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణ, ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు చక్కగా అమలు చేసినందుకు పోలీస్, రెవిన్యూ, పంచాయతీరాజ్ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో నిర్వహించే ఎన్నికల్లో కూడా ఇదే విధంగా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇచ్చిన మార్గదర్శక సూచనలు ఎంతో దోహదపడ్డాయని తెలిపారు. భద్రతాపరంగా ఎక్కడా సమస్యలు తలెత్తకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించామని, ఎన్నికల విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారుల కృషి ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అన్నారు. ఎన్నికల పరిశీలకురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎక్కడ సమస్యలు తలెత్తకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు, ఎన్నికల సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమర్థవంతమైన శిక్షణా తరగతులు నిర్వహించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, వ్యయ పరిశీలకులు భీమ్లా నాయక్, డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్, డీపీఓ శ్రీరాములు, డీఎల్‌పీఓలు, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల పరిశీలకురాలు రాజ్యలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

## ఎమ్మెల్యే బిఆర్‌యస్ పార్టీలో ఉన్నానని చెప్పుకోవడం సిగ్గుచేటు

### ఎమ్మెల్యే ప్రకటనలపై మండిపడిన బాసు హనుమంతు నాయుడు

**గద్వాల టౌన్ డిసెంబర్18, ప్రభాతవార్త:** గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి బిఆర్ యస్ పార్టీలోనే ఉన్నానని చెప్పుకోవడం సిగ్గుచేటని గద్వాల నియోజక వర్గ బిఆర్ యస్ పార్టీ ఇంచార్జీ బాసు హనుమంతు నాయుడు మండిపడ్డారు. ఎమ్మెల్యే తీరుపై గురువారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. స్పీకర్ ఇచ్చిన నిర్ణయంపై ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నాం అని చెప్పడంపై హనుమంతు నాయుడు తప్పుబట్టారు. ఎమ్మెల్యే చెప్పే మాటలు వాస్తవాలు అయితే గత సెప్టెంబర్ నెలలో బిఆర్ యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గద్వాల్ పర్యటనకు వచ్చినప్పుడు సభకు ఎందుకు రాలేద ని ప్రశ్నించారు. అదేవిధంగా మొన్న జరిగిన స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ఫోటోలు పెట్టుకొని గ్రామాలలో ప్రచారం చేసి,గెలిచిన సర్పంచులు ఏ పార్టీ వారో చెప్పాలన్నారు. ఆయా గ్రామాలలో గెలిచిన సర్పంచులను కాంగ్రెస్ సర్పంచులు అనిపించుకుని, ఈరోజు నేను బిఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నా అని ఎమ్మెల్యే నిమిషానికి ఓ మాట మారుస్తున్నారనీ విమర్శించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బిఆర్‌ఎస్ పార్టీ లోనే ఉంటే పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలకు, సభలకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నాడో కూడా నమ్మి ఓటు వేసిన ప్రజలకు కూడా తెలియని అయోమయంలో ఉన్నారని అన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. సాంకేతికతను అడ్డుపెట్టుకుని వారిని తాత్కాలికంగా కాపాడినా రాబోయ్ రోజుల్లో ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో రాజారెడ్డి, బీచుపల్లి, వెంకటేష్ నాయుడు, మోనేష్, శేఖర్ నాయుడు, గంజిపేట రాజు, తిమ్మప్ప గౌడ్, జాంపల్లి భరత్ సింహారెడ్డి, అంజి, రజినీబాబు, గంగాధర్, గోవర్ధన్, చిన్న యాదవ్, రాజు, బిఆర్ యస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ ఇంచార్జీ బాసు హనుమంతు

## ఏడాదిలోగా అభివృద్ధి పనులు పూర్తి : మార్కెట్ కమిటీ చైర్మన్

**ఆత్మకూర్ డిసెంబర్ 18, ప్రభాతవార్త :** ఉమ్మడి ఆత్మకూరు మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఏడాదిలోగా పూర్తిచేసి ప్రజలకు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా అన్నారు. గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామ సమీపంలో ఈ నెల 1న కృష్ణా నదిపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన నేపథ్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అహ్మతుల్లా నేతృత్వంలో పనులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు మరిన్ని విస్తృత సేవలు అందించేందుకు కృత నిశ్చయంతో పనిచేస్తుందని అందులో భాగంగానే రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి పట్టుపట్టి సాధించిన కృష్ణా నదిపై నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన ఏడాది లోగా పూర్తిచేసి రాకపోకలు కలిగించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆయన తెలిపారు. నూతనంగా నిర్మించే బ్రిడ్జి మూలంగా ఆత్మకూర్కత్వాల్ మధ్య సుదూర ప్రాంతం తగ్గడమే కాకుండా వ్యాపార లావాదేవీలకు విస్తృతంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా మేలు జరుగుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా ఉమ్మడి ఆత్మకూరు మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ఏడాది లోగా పూర్తి చేయించేందుకు రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలకు అభివృద్ధి ఫలాలను పంచేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నలగొండ శ్రీనివాసులు ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ మక్తల్ నియోజకవర్గం మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట నరసింహారావు, అక్షర స్కూల్ దామోదర్, గాలి పంపు శ్రీనివాసులు, బోయ రాజు, ఇర్లదిన్నె శ్రీనివాసులు తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ఎఫ్‌డిఐతో దేశీయ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభం లేదు

**గద్వాల టౌన్, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** ఎఫ్డిఐ వంద శాతం ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 నుండి 100 శాతానికి పెంచడం వలన ఫారిన్ కంపెనీ లకి పెద్ద మొత్తంలో అవకాశం (యాక్సెస్) లభిస్తుంది తప్ప దేశీయ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఎలాంటి లాభం లేదని గద్వాల ఎల్ ఐ సి బ్రాంచి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు అన్నారు. పట్టణంలోని గురువారం ఎల్ ఐ సి కార్యాలయంలో బోజన విరామ సమయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న 74 ఎఫ్‌డీఐ పరిమితి దాదాపు ఏ ఒక్క ప్రైవేట్ కంపెనీ కూడా పూర్తిగా వినియోగించుకోలేదనీ, 25 ప్రైవేట్ కంపెనీలలో కలిపి ఇప్పటి వరకు కేవలం 32 మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సగటున ఉన్నట్లుగా ప్రభుత్వ లెక్కలు చూపుతున్నాయని అన్నారు. ఇప్పుడు ఈ ఎఫ్ డీ ఐ ల పరిమితి 100 శాతానికి పెంచడం ద్వారా స్వదేశీ కంపెనీలు విదేశీ కంపెనీలకు తమ వాటా మొత్తాన్ని అమ్ముకొని ధారాదత్తమైపోయే ప్రమాదం ఉన్నదన్నారు. ఏర్పడబోయే కొత్త ప్రైవేట్ కంపెనీలన్నీ వందశాతం విదేశీ పెట్టుబడితో ఏర్పాటయ్యి, సదరు విదేశీ కంపెనీల ప్రాబల్యం భారత ఇన్సూరెన్స్ మార్కెట్ పై పెరుగనున్నదన్నారు. భారతదేశ ప్రజల పొదుపుపై విదేశీ కంపెనీల ఆధిపత్యం మరింత పెరుగనున్నదనీ, దేశీయ కంపెనీలు గానీ, లేదా ప్రజానీకం గానీ ఈ పెంపును కోరుకోలేదన్నారు. అందరికీ 1947 నాటికి బీమా సౌకర్యాన్ని అందివ్వాలంటే ప్రజల చేతిలో కొనుగోలు శక్తి పెరగాలి తప్పా, విదేశీ కంపెనీలొచ్చి పాలసీలను అమ్మడానికి ప్రయత్నిస్తే లక్ష్యాన్నీ చేరుకోలేము అన్నారు. ఈ కార్యక్రమంలో క్లాస్ ఓన్ ఆఫీసర్ దివాకర్, జాన్ సుధాకర్, భాస్కర్, క్లాస్ త్రీ ఎంప్లాయిస్ రంగయ్య, ఉదయ్, రాఘవేంద్ర, మల్లికార్జున్, మనీష్, సూరజ్, సుదర్శన్ శెట్టి, ఏజెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు

## శరణార్థులకు సహకారంగా రక్తదాన కార్యక్రమం

### రెడ్ క్రాస్ సొసైటీ చైర్మెన్ సంగాల అయ్యపు రెడ్డి

**గద్వాల టౌన్ డిసెంబర్ 18, ప్రభాత వార్త:** ఆపదలో ఉన్న శరణార్థులకు సహకారంగా రక్తదాన శిబిరం కార్యక్రమం చేపడుతున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అయ్యపు రెడ్డి అన్నారు. గురువారం గద్వాల పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన సొసైటీ సభ్యులతో కలిసి రక్తదాన శిబిరాన్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ అయ్యపు రెడ్డి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం దొరకక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, భౌష్యత్యులో అటువంటి పరిస్థితులు ఎవరికి రాకూడదనే ఉద్దేశ్యంతో ప్రతినెల రక్తదానా శిబిరాలను ఏర్పాటు చేసి ఆపదలో వున్న వారందరికీ అవసరమైనంత రక్తాన్ని అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్నామని ఆయన అన్నారు. జిల్లా గవర్నమెంట్ బ్లడ్ బ్యాంకు నందు రక్త యూనిట్ల కొరత ఉందని సమాచారం అందడంతో గవర్నమెంట్ బ్లడ్ బ్యాంకు సహకారంతో అత్యవసర స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని,ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి వారిని కాపాడడంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారన్నారనీ ఆయనఅన్నారు. రక్త దానం ప్రాణదానం అని, రక్త, నేత్ర అవయవ దానాల పై ప్రజలు అపోహలు విడనాడాలని, ఆపదలో వున్న వారి ప్రాణాలకు రక్షణగా నిలవాలని అయ్యపు రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ ఎం.డి.తాహేర్, కోశాధికారి ధనలక్ష్మి ౹, ఇసి మెంబర్లు అక్బర్ బాషా, రవి,అప్సర్ భాష, పాల్ సుధాకర్, పెదొడ్డి నల్లారెడ్డి,లక్ష్మీ ౹నారాయణ గౌడ్, డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ మోహన్ రావు,కరాటే శ్రీహరి, డిటిఎఫ్ ప్రభాకర్, అతికూర్ రెహమాన్,ధరూర్ రవి,మహేష్ నాయుడు,రాకేష్, రాజు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




రక్తదాన శిబిరంలో చైర్మెన్ అయ్యపు రెడ్డి, సొసైటీ సభ్యులు

## సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్‌ను సన్మానించిన వైద్య సిబ్బంది



మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్‌ను గురువారం వారి నివాసంలో వైద్య సిబ్బంది కలిసి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో సిబ్బంది జాంగిర్‌బి సుజాత, పద్మ, అనిత, బాలమణి, అనురాధ తదితరులు ఉన్నారు.

## క్రిస్మస్ పండుగకు చర్చీల ముస్తాబు

**గద్వాల టౌన్, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** క్రిస్మస్ పండుగ 2025 సందర్భంగా గద్వాల జిల్లా లోని గద్వాల నియోజకవర్గంలో గల 50 చర్చిలు, అలంపూర్ నియోజకవర్గంలోని 50 చర్చిలకు అందంగా అలంకరించుటకు వాటికి సున్నం, డెకరేషన్ (ఎలక్ట్రిక్ లైటింగ్) కొరకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించనున్నదని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిని నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గల రిజిస్టర్ అయిన చర్చిలు కలిగిన వారు దరఖాస్తు చేసుకునుటకు చర్చి కమిటీ యొక్క లెటర్ హెడ్,చర్చి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, చర్చి కమిటీ వారి బ్యాంక్ అకౌంట్, చర్చి యొక్క ఫోటోలతో వారి యొక్క దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం రూమ్ నెంబర్ 08, మొదటి అంతస్తు, జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ఈనెల 20 వరకు సమర్పించాలని ఆమె తెలిపారు. ఇతర వివరములకు సెల్ నెంబర్ 7013032567ను సంప్రదించాలని తెలిపారు.

## కరాటే మాస్టర్ శ్రీహరికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

**గద్వాల టౌన్ డిసెంబర్ 18, ప్రభాతవార్త:** నడిగడ్డ బిడ్డ గద్వాల పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ శ్రీహరి కి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ రిటైర్డ్ ఆర్మీ సహకారంతో వెటర్నర్స్ ఇండియా స్పోర్ట్స్ వింగ్ వారి అధ్వర్యంలో నిర్వహించిన విజయ్ దివాస్ న్యూ ఢిల్లీలో తెలంగాణ రాష్ట్రములోని జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ తైక్వాండో మాస్టర్ కరాటే శ్రీహరి "పెట్రోటిక్ స్పోర్ట్స్ అంబాసిడర్ అవార్డు" తో అరుదైన గౌరవం పొందారు. దీంతో జిల్లా ప్రజలు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి మరెన్నో పురస్కారాలు మాస్టర్ శ్రీహరి పొందాలని ఆకాంక్షి ంచారు.

## ఎన్నికల్లో విధుల పట్ల నిరక్ష్యం వహించిన అధికారి సస్పెండ్

**అయిజ డిసెంబర్ 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తూముకుంట గ్రామంలో ఆదివారం నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు సక్రమంగా నిర్వహించిన కారణంగా ఓ పి ఓ పి సుదర్శన అనే అధికారిని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో భాస్కర రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఇప్పటికే గ్రామపంచాయతీ ఎన్నికల్లో కౌంటింగ్ లో లోపాలు ఉన్నాయని మరల రీపోలింగ్ నిర్వహించాలని గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన సంఘటన తెలిసిందే రీపోలింగ్ నిర్వహించాలని గ్రామస్తులు చేస్తున్న డిమాండ్‌కు మునుముందు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో గ్రామస్తులు వేచి చూస్తున్నారు.

## ట్రాక్టర్ స్కూటర్‌కు తగిలి ఇరువురికి తీవ్ర గాయాలు



ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఖిల్లాగణపురం డిసెంబర్18, ప్రభాతవార్త:** మహమ్మద్ హుస్సేన్ పల్లినుండి గణపురం మండలకేంద్రానికి బుధవారం రాములు, సత్యనారాయణ ఇరువురు తమ స్కూటీపై వస్తుండగా దారిలో తిరుపతయ్య తనపొలం పనులు ముగించుకుని ట్రాక్టర్లు తీసుకొస్తుండగా రోడ్డుమలుపు వద్ద ట్రాక్టర్ వెనకాల ఉన్న రోటోవేటర్ స్కూల్ బలంగా తగలడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి ఒకరికి కాలు విరిగినట్లు ప్రత్యక్ష సాక్షం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం మహబూబ్నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

## అసైన్డ్ భూములను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలి

**రెవెన్యూ అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**వనపర్తి, డిసెంబరు 18 ప్రభాతవార్త :** జిల్లాలోని ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ పై సమీక్ష నిర్వహించారు. భూ భారతి డేటా ప్రకారం ఆయా మండలాలు, గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను సర్వే నెంబర్ల ఆధారంగా గుర్తించి డేటా అప్‌లోడ్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆలస్యం అయ్యిందని వారం రోజుల్లో భూముల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు ఇంకా దాదాపు 5 వేల ఎకరాలు గుర్తించాల్సి ఉందని, అదేవిధంగా 7 వేల ఎకరాలు అసైన్డ్ భూములను గుర్తించాల్సి ఉందని తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్.ఖీమ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రమణ్యం, డి సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, హెచ్‌హెచ్‌ఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నియోజక వర్గంలో కారు జోరు

**నారాయణ పేట, డిసెంబరు 18 ప్రభాతవార్త :** పేట జిల్లా మూడో విడత ఎన్నికలలో ఐదు మండలాలకు గాను 110 స్థానాలు కాంగ్రెస్ 60, బీఆర్ఎస్ 25, బీజేపీ 17 ఇతరులు 8 మండలాల వారీగా పార్టీలు గెలుపొందారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యాన్ని ప్రదర్శించగా, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కూడా గణనీయ సంఖ్యలో స్థానాలను దక్కించుకున్నాయి. కృష్ణ మండలంలో మొత్తం 13 స్థానాలకు గాను కాంగ్రెస్ 7 స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ 5, బీఆర్ఎస్ 1 స్థానంలో గెలుపొందాయి. మాగనూరు మండలంలో 18 స్థానాలు ఉండగా,కాంగ్రెస్ 8, బీజేపీ 5, బీఆర్ఎస్ 1 స్థానాల్లో విజయం సాధించాయి మక్తల్ మండలంలో అత్యధికంగా 39 స్థానాలు ఉండగా, కాంగ్రెస్ పార్టీ 19 స్థానాల్లో గెలుపొంది ఆధిక్యాన్ని చాటింది. బీజేపీ 11,బీఆర్ఎస్ 5 స్థానాల్లో గెలిచాయి. నర్వ మండలంలో మొత్తం 19 స్థానాలకు గాను కాంగ్రెస్ 11, బీజేపీ 3, బీఆర్ఎస్ 3 స్థానాల్లో విజయం సాధించాయి. ఊట్కూర్ మండలంలో 23 స్థానాలు ఉండగా,కాంగ్రెస్ పార్టీ 15 స్థానాల్లో ఘన విజయం సాధించింది. బీజేపీ 7 స్థానాల్లో గెలుపొందగా, బీఆర్ఎస్ ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. మొత్తంగా జిల్లాలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముందంజలో నిలిచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

**దామరగిద్ద,డిసెంబరు 18 ప్రభాతవార్త** దామరగిద్ద మండల కేంద్రంలోని స్థానిక అంబా భవాని గుడిప్రాంగణంలో గురువారం అయ్యప్ప స్వామి 22వ మహా పడి పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సన్నిధాన గురు స్వాములు మహేందర్ నాథ్, శంభు లింగం ఆధ్వర్యంలో పూర్ణాపుష్కలాంబ సమేత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి కలశ ఊరేగింపు, స్థానిక బసవేశ్వర గుడి దగ్గర నుండి ఊరేగింపు పురవీధుల గుండా పూజ మంటపానికి చేరుకుంది. అనంతరం స్వామివారికి పవిత్ర జలాలతో పంచామృతాభిషేక కార్యక్రమాలు చేపట్టారు. మంగళహారతులతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. స్వామివారికి చేసిన కనకాభిషేకం మద్దూరు మండలానికి చెందిన వినోద్ కుమార్ గౌడ్ కన్నె స్వామి 33 వేల రూపాయలకు వేలంపాటలో గెలుచుకున్నారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన గురుస్వాములకు అయ్యప్పలకు, భక్తులకు స్వామివారి అన్న ప్రసాద దాత హోం సాయి ఎలక్ట్రికల్స్ బొంబాయి సేట్ వన్నడి వెంకటప్ప కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో అప్పి గురుస్వామి, అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సేవా సమితి జిల్లా అధ్యక్షులు డా. కాకర్ల భీమయ్య గురు స్వామి, మద్దూరు మహేష్ గురు స్వామి, బుగ్గప్ప గురుస్వామి, మొదేల్ గురు స్వాములు, దామరగిద్ద సర్పంచ్ అద్దన్ కనికి రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప,ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలి

**అడ్డాకుల,డిసెంబరు 18 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై, సైబర్ మోసాల పట్ల కళాబృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన, అటల్ పింఛన్ యోజన, డిజిటల్ నగదు రహిత లావాదేవీలపై, అలాగే రైతులకు పంట రుణాలపై,



ప్రదర్శన ఇస్తున్న కళాబృందం

మహిళా సంఘాల పొదుపు గ్రూపు రుణాలపై, బంగారు రుణాలపై కళాజాత బృందంచే మ్యాజిక్ షో ద్వారా ఎం.వి రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారిచే బ్యాంకు కస్టమర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సందీప్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ వినోద్ కుమార్, క్యాషియర్ పావని, బ్యాంకు సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు విజయ్, మెజీషియన్ లక్ష్మీ మ్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఉప సర్పంచుల ఎంపిక

**ఉప్పునుంతల, డిసెంబరు 18 ప్రభాతవార్త :** బుధవారం జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో జరిగిన పోటీల్లో సర్పంచులుగా గెలుపొందారు. ఉప సర్పంచ్‌లను గురువారం ఎన్నుకున్నారు. అయ్యవారిపల్లి ఉప సర్పంచ్‌గా జరుపల బాలు, సీబీ తండా ఉప సర్పంచ్ సభావట్ మమత, దాసర్లపల్లి ఉపసర్పంచ్ పానుగంటి శంకర్, దేవదారి కుంట తండా సభావట్ మంగమ్మ, ఈరట్వాన్ పల్లి ఉప సర్పంచ్ కేతావత్ గోపాల్, గువ్వలోని పల్లి ఉప సర్పంచ్ కాస్ని శిరీష వలి, కంసానిపల్లి ఉప సర్పంచ్ గా పోల జితేందర్, కంసానిపల్లి తండా ఉప సర్పంచ్ కాట్రావత్ లక్ష్మి మ్మ, కొరటికల్ వాయిదా, లతీపూర్ దాసరి అంజనమ్మ, లక్ష్మాపూర్ ఉప సర్పంచ్ సామ శాంతమ్మ, మామిళ్ళపల్లి పానం సైదులు, మర్రిపల్లి ఉపసర్పంచ్ మద్దెల బండ కొండయ్య, మొల్గర ఉప సర్పంచ్ మాడుగుల రమేష్, పెద్దాపూర్ జిల్లెల్ల నరేష్, పెనిమిళ్ళ వాయిదా, పిరట్వాన్ పల్లి ఉప సర్పంచ్ పెబ్బేటి భీమయ్య, సూర్య తాండ పసుల మహేష్ రెడ్డి, రాయిచేడు గోరటి విజయ, సూర్య తండా ఉపసర్పంచ్ మూడవత్ దేవేందర్, తిప్పాపూర్ ఎడ్ల చంద్రయ్య యాదవ్, తిరుమలాపూర్ రాసమొళ్ళ రేణయ్య, ఉప్పరపల్లి ఉపసర్పంచ్ గా రెసోజు శ్రీనివాసాచారి, ఉప్పునుంతల అంతటి శైలజ, వెల్టూరు ఉప్పరి మల్లయ్య, జప్తి సదగోడు మామిడి చెట్టు రాధ లు ఎంపికైనట్లు ఎంపిడిఓ వరుణ్ తేజ తెలిపారు.

## కానుకుర్తి సర్పంచ్‌కి సన్మానం

**దామరగిద్ద, డిసెంబరు 18 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని కానుకుర్తి గ్రామ సర్పంచ్ నారాయణను అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు డా. కాకర్ల భీమయ్య గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. గత 25 సంవత్సరాల తర్వాత గ్రామంలో బీసీ అభ్యర్థి సర్పంచ్‌గా గెలవడం గర్వకారణమని బీసీలు మరింత అభివృద్ధి చెందేందుకు సర్పంచ్ నారాయణ కృషి చేయాలని డా. కాకర్ల భీమయ్య కోరారు. ప్రభుత్వం నుండి వచ్చే నిధులతో గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి జిల్లాలో ఆదర్శవంత గ్రామంగా కానుకుర్తిని తీర్చిదిద్దాలని కాకర్ల భీమయ్య సర్పంచ్ నారాయణ ముదిరాజ్ ని కోరారు. సర్పంచ్ నారాయణతో పాటు వార్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డిని సైతం శాలువాతో ఘనంగా సన్మానించారు.

## నూతన సర్పంచులను సన్మానించిన మాజీ మంత్రి

**బాలానగర్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలో బుధవారం మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన బిఆర్ఎస్ సర్పంచులను మాజీ మంత్రి లక్ష్మా రెడ్డి సన్మానించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో బిఆర్ఎస్ మద్దతు దారులు సర్పంచులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచులను గురువారం మాజీ మంత్రి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే



సభ్యులను సన్మానిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

చర్లకోల లక్ష్మారెడ్డి మండలంలోని పెద్దాయపల్లి చౌరస్తాలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందన్న నాయకులకు ఈ గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు బిఆర్ఎస్ పార్టీ సత్తా తెలియజేసిందన్నారు. ఈ ఎన్నికల ఫలితాలతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పార్టీపై నమ్మకం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నూతన సర్పంచులు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్పంచులు భాద్యతాయుతంగా ఉండాలి

**గ్రామాభివృద్ధి లో సర్పంచులది కీలక పాత్ర**

**మక్తల్ నియోజకవర్గం లో అత్యధిక స్థానాలు గెలుచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి**

**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలి**

**ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల సన్మాన సభలో మంత్రి వాకిటి శ్రీహరి**



మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్‌టౌన్,డిసెంబరు 18 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ సర్పంచ్‌లను రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. పట్టణంలో ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో గెలిచిన అభ్యర్థులను అభినందించారు. గెలిచిన సర్పంచులకు ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశంలో ప్రజల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టే డబ్బుకు సంతకం చేసేది ఒకరు గవర్నర్ కాగా మరొకరు సర్పంచని మంత్రి అన్నారు.గ్రామ, రాష్ట్ర, దేశాభివృద్ధిలో సర్పంచులది కీలక పాత్ర అని మంత్రి తెలిపారు.గ్రామంలో జరిగే అభివృద్ధిలో సర్పంచులకు గురుతర భాద్యత ఉంటుందన్నారు. ఊరి ప్రజలకు సేవ చేసే అవకాశం దేవుడు ఇచ్చిన గొప్ప వరం అని తెలిపారు. సర్పంచ్ పదవిని ఎవ్వరూ దుర్వినియోగం చేయొద్దని మంత్రి హితభోద చేశారు. వ్యక్తుల దగ్గర కోట్లు ఉంటే కాదని నోరు బాగుండాలన్నారు. నోరు బాగుంటే ఊరు బాగుంటుందని తెలిపారు. మీ గ్రామాలను అభివృద్ధి చేసుకొని ఊరి ప్రజల దగ్గర మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు ఎవరూ అధైర్య పడవద్దని, రాబోవు రోజుల్లో ప్రతీ ఒక్కరికీ అవకాశాలు వస్తాయని భరోసానిచ్చారు. రాజకీయాల్లో ఎత్తు పల్లాలు ఉంటాయాని, వాటిని ఆదిగమించి ముందుకు సాగాలని హితవు పలికారు. మాకుటుంబంలో ఎవ్వరూ పదవుల కోసం పాకులాడే వ్యక్తులం కాదని మంత్రి శ్రీహరి స్పష్టం చేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే మక్తల్ నియోజకవర్గంలో రూ.1035కోట్లతో అభివృద్ధి పనులు చేశామని మంత్రి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మన మక్తల్ నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని మాటిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసే దిశగా కార్యకర్తలు పనిచేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ సభకు భారీగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు మక్తల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి, బికేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణా రెడ్డి, మక్తల్, ఉట్కూర్, మాగనూర్, కృష్ణా, నర్వ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులను సన్మానిస్తున్న మంత్రి



కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు, మహిళలు

# రెటినోపతి వైద్యపరీక్షలను మరింత పటిష్టంగా అమలు చేయాలి

**జిల్లా వైద్య అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం**



కలెక్టర్‌తో సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారులు

**వనపర్తి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మధుమేహం వ్యాధిగ్రస్తులకు చేపట్టిన రెటినోపతి వైద్య పరీక్షల కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్లో వనపర్తి జిల్లాలో చేపట్టిన రెటినోపతి వైద్య పరీక్షల కార్యక్రమం తీరుతెన్నుల పై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు గుర్తించిన దాదాపు 19500 మంది మధు మేహం వ్యాధిగ్రస్తులకు భవిష్యత్తులో రేటినోపతి వ్యాధి వల్ల దృష్టి కోల్పోకుండా ముందుగానే గుర్తించి వైద్యం అందించే ఉద్దేశ్యంతో నవంబర్ మాసంలో గ్రామాలకు వెళ్లి మధుమేహం వ్యాధిగ్రస్తులకు రేటినోపతి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇది వంద పనిదినల్లో లక్ష్యం పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 2238 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 175 మందికి రేటినోపతి లక్షణాలు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. వీరిలో (9) మందికి డయాబెటిక్ రేటినోపతి లక్షణాలు తీవ్రంగా ఉండటాన్ని గుర్తించి మెరుగైన వైద్యం కొరకు హైదరాద్ లోని సరోజినీ కంటి ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. రోగులకు హైదరాబాద్ వెళ్ళడానికి ఇబ్బందులు కలుగుతున్నందున నాగర్ కర్నూల్ జిల్లాలోని తుడుకుర్తి ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రితో ఒప్పందం చేసుకోవడం జరిగిందని, ఇకనుండి గుర్తించిన రేటినోపతి రోగులను తూడుకుర్తి ఎల్.వి.ప్రసాద్ ఆసుపత్రికి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు చేసేందుకు వైద్యులు వచ్చినప్పుడు మధుమేహం వ్యాధి ఉన్న ప్రతి ఒక్కరూ రేటినోపతి కంటి వైద్య పరీక్ష చేయించుకునే విధంగా ఆశా, ఎఎన్‌యంలకు బాధ్యత కల్పించాలని సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డా. రామచంద్రరావు, జిల్లా నోడల్ ఆఫీసర్ డా. రియాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచులను సన్మానించిన ఎమ్మెల్యే

**పెబ్బేరు,డిసెంబరు18 ప్రభాతవార్త:**పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ పాలనలో సర్పంచులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారు.కాంగ్రెస్ పాలనలో నేడు సుస్థిర అభివృద్ధి కొనసాగుతోంది విజయం సాధించిన సర్పంచ్‌లను, ఉపసర్పంచులను, వార్డు సభ్యులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సన్మానించి అభినందించారు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని ప్రస్తుతం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో నిరూపణ అయిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం నంది హిల్స్‌లోని తన నివాస కార్యాలయంలో పెబ్బేరు మండలాల్లో 3వ విడతలో నిర్వహించిన సర్పంచ్ ఎన్నికలలో విజయం సాధించిన సర్పంచ్‌లను, ఉపసర్పంచులను,వార్డు సభ్యులను,ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు ఎన్ని ఎత్తుగడలు వేసిన నీచ రాజకీయాలు చేసిన గ్రామాలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారని



పెబ్బేరు మండలంలో అత్యధిక మెజార్టీ సంపాదించిన అరుణ జైపాల్‌ను సన్మానించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

కాంగ్రెస్ పార్టీ తరపున నిలబడిన సర్పంచులను వార్డు సభ్యులను పెద్ద ఎత్తున గెలిపించారని ఆయన అన్నారు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ ఎత్తున గెలిచారని, మరోపక్క కాంగ్రెస్ పార్టీ తరపున స్వతంత్రులుగా నిలిచిన అభ్యర్థులకు సైతం అధిక మొత్తంలో ఓట్లు పోలయ్యాయని ఈ ప్రకారంగా చూసుకుంటే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎత్తున ప్రజలు బ్రహ్మరథం పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు, ఉచిత కరెంటు,మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, సన్న బియ్యం పంపిణీ, విద్యార్థులకు ఉన్నత విద్య,వసతి గృహాల్లో మెరుగైన భోజన వసతులు,మెరుగైన వైద్య సదుపాయం,ఐదు లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీని 10 లక్షలు చేయడం, రైతు భరోసా,సన్న వడ్లకు బోనస్, భూమిలేని నిరుపేదలకు సైతం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందివ్వడం,రుణమాఫీ,లాంటి అనేక పథకాలు చేపట్టి గ్రామాలలోని నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రస్తుతం విజయం సాధించిన సర్పంచులు, ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించేలా పనిచేయాలని ప్రతి ఒక్కరికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉండే గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే వారికి సూచించారు.

# బీజేపీతో పాటు మిత్రపక్షాల సర్పంచులకు ప్రత్యేక అభినందనలు

**కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్**

**నారాయణ పేట, డిసెంబరు 18 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా పరిధిలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీతో పాటు మిత్రపక్షాల తరఫున గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లాలోని ఉట్కూర్ కొల్లూరు,కొత్తపల్లి, లక్ష్మి పల్లి,మగ్దుంపూర్,పెద్దజట్రం, బిజ్వార్,జబలాపూర్ మాధ్వార్,కాట్రేపల్లి, మదనపల్లి, సామాన్‌పల్లి తదితర గ్రామాల్లో బీజేపీతో పాటు బీజేపీతో పొత్తు కలిపిన పార్టీల అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ పిలుపునందుకొని ప్రజలు బీజేపీ అభ్యర్థులను గెలిపించడం అభినందనీయమన్నారు. ఎంపీ నిధులు కేంద్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమను కేవలం గ్రామ సర్పంచులుగా కాకుండా పల్లె సేవకులుగా" ఎన్నుకున్నారని గుర్తుంచుకొని, భారతీయ జనతా పార్టీ అడుగుజాడల్లో నడుస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశయాలకు అనుగుణంగా పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు తెలంగాణ వ్యాప్తంగా జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బలమైన పునాదులు వేయాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ఓటర్లకు మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు జిల్లా పీఆర్‌టీయూ టీఎస్ సన్మానం

**నారాయణ పేట, డిసెంబరు 18 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఇంచార్జ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్థానిక సంస్థల జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను పీఆర్‌టీయూ టీఎస్ నారాయణపేట జిల్లా శాఖ ప్రతినిధులు వారి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వరుసగా జరిగిన



జిల్లా ఇంఛార్జి కలెక్టర్‌ను సన్మానిస్తున్న పిఆర్‌టియు టిఎస్ నాయకులు

ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధ్యాన్ని గౌరవించి, వివిధ దశలలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ప్రస్తుతం జిల్లాలో చలిగాలుల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పాఠశాలల పని వేళలను ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహించేలా సమయంలో మార్పు చేయాలని వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా పదవ తరగతి ప్రత్యేక తరగతులను ఉదయం ఎనిమిది గంటలకు కాకుండా ఎనిమిదిన్నర గంటలకు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు ఈ సందర్భంగా ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులను, సహకరించిన ఉపాధ్యాయ సంఘాలను కలెక్టర్ అభినందించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి, నారాయణపేట మండల అధ్యక్షులు ఏం. రఘువీర్, ప్రధాన కార్యదర్శి ఎం.జనార్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర



ఈర్లదిన్నె గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్, వార్డు సభ్యులను అభినందిస్తున్న రాష్ట్రమంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

**అమరచింత డిసెంబర్ 18, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి లో సర్పంచులదే కీలక పాత్ర అని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి, డాక్టర్ వాకిటి శ్రీహరి సర్పంచులను కోరారు. గురువారం అమరచింత మండలంలోని ఈర్లదిన్నె గ్రామ సర్పంచ్ చుక్క వెంకటమ్మ, మొరెడ్డి లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ చుక్క ఆసిరెడ్డి, డైరెక్టర్ వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు మంత్రి క్యాంప్ ఆఫీస్ లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను మంత్రి వాకిడి శ్రీహరి సన్మానించారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ సర్పంచులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, అలాగే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి సర్పంచ్లను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈర్లదిన్నె గ్రామ కాంగ్రెస్ నాయకులు పెద్దలు, యువకులు, వార్డ్ మెంబర్స్ దామోదర్ రెడ్డి,శ్రీనివాసులు, శ్రీలింగారెడ్డి,పి సహదేవమ్మ, చాకలి మునియప్ప, కే శివ,లింగమ్మ,రవి పాల్గొన్నారు.

## కబడ్డీ క్యాంపును సందర్శించిన స్నిగ్ధారెడ్డి



కబడ్డీ క్రీడాకారులతో మాట్లాడుతున్న స్నిగ్ధారెడ్డి, రామాంజనేయులు

**గద్వాల టౌన్ డిసెంబర్ 18, ప్రభాతవార్త:** 72వ రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ క్యాంపును జోగులాంబ గద్వాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డికె. స్నిగ్ధారెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 25 తేదీ నుండి 28తేదీవరకు కరీంనగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో జిల్లాకబడ్డీ జట్టు విజయం సాధించలని ఆమె కోరారు.ఈకార్యక్రమంలో జిల్లాఅధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్రకౌన్సిల్ మెంబర్ బండలవెంకట రాములు, జోగులాంబ గద్వాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ కబడ్డీ నరసింహ, టి.రవి,నగేష్, వెంకటన్న,బిజెపి నాయకులు ,శ్యామ్ రావ్, సాయి ,దాస్, మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పర్వతాపూర్ మైసమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

**నవాబుపేట, డిసెంబరు 18 ప్రభాతవార్త :** మహిమాన్విత పర్వతాపూర్ మైసమ్మ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాచుర్యం పొందిన మైసమ్మ దేవాలయ జాతర వాల్ పోస్టరును నవాబ్ పేట మండలంలోని కాకర్లపాడు మైసమ్మ జాతర వచ్చేనెల 2026 జనవరి 2 నుంచి 6 వరకు నిర్వహించనున్న పర్వతాపూర్ మైసమ్మ బ్రహ్మోత్సవాల పోస్టరును ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. గురువారం హైదరాబాద్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జగన్మోహన్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ మోహినుద్దీన్, ప్రజా ప్రతినిధులు నారాయణరెడ్డి, వీరాంజనేయులు, రికార్డ్ అసిస్టెంట్ గోపాల్,బక్క బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేత: ఎమ్మెల్యే



**దేవరకద్ర,డిసెంబరు 18 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం ముచ్చింతలలో పెద్ద గొల్లచంద్రన్న ఇటీవలే ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రమాద భీమా కింద రూ. 50 వేల చెక్కును విద్యుత్ అధికారులు సమక్షంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముచింతల స్థానిక సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, మైపాల్ రెడ్డి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ వైపే ప్రజలు

(మొదటి పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేసారు. కేసీఆర్ గ్రామాలనువ్యర్థంగా పరిశుభ్రంగా మార్చారని, కేసీఆర్ హయంలో కేంద్ర సంస్థల అవార్డ్ లు తెలంగాణకు వచ్చాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో నలభై శాతం సర్పంచ్ స్థానాలు బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. గ్రామీణ సంస్థల ఎన్నికల ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటాయి..అయినప్పటికీ బీఆర్ఎస్ విజయం సాధించింది, మొదటి విడత దెబ్బకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రామ గ్రామాన తిరిగారని చెప్పారు. అయినా బీఆర్ఎస్ సర్పంచ్ లు విజయం సాధించారని, ఇది ప్రజలు ఇచ్చిన తీర్పు అన్నారు. పోలీస్,పవర్,పైసలు వాడినా కాంగ్రెస్ కి ప్రజలు బుద్ధి చెప్పారని పేర్కొన్నారు.ఎమ్మెల్యే కాంగ్రెస్ లోకివెళ్ళిన రానివ్వను అన్నారు.. ఇప్పుడేమో ఎవరొస్తరా అని చూస్తున్నారని చెప్పారు. జడ్చర్ల నియోజక వర్గంలో 1087 పంచాయతీలకు ఎన్నికలు జరిగాగా 88 పంచాయతీల్లో బి ఆర్ఎస్ గెలిచిందన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పై ప్రజలు నమ్మకం లేదని, పంచాయతీ ఎన్నికలే ఎందుకు నిదర్శనం అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే గతంలో తమ పార్టీలోకివెళితే తీసుకోమనిరానివ్వమని ఇప్పుడెందుకు తీసుకుంటున్నారో, ఇప్పటివరకు వెళ్లినవారి పరిస్థితి ఏంటో చెప్పాలన్నారు. తమ పార్టీ నాయకులను సర్పంచులను నిధుల ఇవ్వమని,పార్టీలోకి రావాలంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఎవ్వరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అంతా ధైర్యంగా ఉండాలన్నారు.

## 35 మంది టచ్‌లో ఉన్నారు

(మొదటి పేజీ తరువాయి)

మెక్కింది ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసినా రాష్ట్రంలో బీఆర్ఎస్ 10 శాతం సర్పంచ్ స్థానాలను కూడా నెగ్గలేకపోయిందని ఎద్దేవా చేశారు. సర్పంచులను ఏ పార్టీకి చెందినవారైనా వాళ్ల మంచివాళ్లయితే వారిని దగ్గరకు తీస్తామని అనిరుధ్ హామీ ఇచ్చారు. అయితే సర్పంచ్ పదవులను అడ్డం పెట్టుకుని భూకబ్జాలు చేయాలని, ప్రజలను భయభ్రాంతులను చేయాలని చూస్తే మాత్రం తాను సహించేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేసారు. గత రెండేళ్లుగా ఎలాంటి భూకబ్జాలు జరగకుండా నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని,ఈ ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేయాలనిచూసినా సహించబోమని పేర్కొన్నారు. తాను నియోజకవర్గంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో 40 బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారికే వచ్చాయని, అర్హత ఉన్న వారి విషయంలో తాను రాజకీయ వివక్ష చూపలేదని పేర్కొన్నారు. సర్పంచులు మంచివారైతే వారి సలహాలు కూడా కమిటీలు పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.కాగా పంచాయతీ ఎన్నికలలోఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయా గ్రామాలకు ఇంచార్జులుగా పెడతామని, ఎమ్మెల్యే నిధుల ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల మంజూరులో గ్రామ ఇంచార్జులకు ప్రాధాన్యత ఇస్తామని వివరించారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ వారికి ప్రాముఖ్యత ఇస్తామని చెప్పారు. ప్రస్తుతం ఎస్డీఎఫ్ నిధులు వచ్చాయని, కొత్తగా గెలిచిన సర్పంచులు తమ ప్రమాణ స్వీకారం తర్వాత వచ్చి తమ గ్రామాల్లో తాము ఇచ్చిన హామీల మేరకు ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ఇస్తే వాటిని మంజూరు చేయిస్తామని అనిరుధ్ రెడ్డి ప్రకటించారు.

## పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

కృతజ్ఞతలు తెలిపారు.ఎన్నికల కోడ్ అమలులో కఠిన చర్యలు - నగదు, మద్యం స్వాధీనంఎన్నికల కోడ్ అమలులో భాగంగా చేపట్టిన తనిఖీలు, నిఘా చర్యలలో రూ.11,08,250/ నగదును సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా రూ.6,93,858/ విలువగల మద్యం కేసులకు సంబంధించి 81 ఎక్సైజ్ కేసులు నమోదు చేసి 1050.23 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.అలాగే రూ.7,200/ విలువగల ఉచితాల పంపిణీకి సంబంధించిన1 కేసు,3 ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసులు,4 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (లీదిది) ఉల్లంఘన కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా 70 నాఖాబందీ ఆపరేషన్లు, 37 ఆయుధాల డిపాజిట్, 640 మందిని బైండోవర్ చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా3 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించినట్లు జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతాం

**- కార్పొరేట్లకు దోచిపెడుతున్న బీజేపీ - డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబర్18,ప్రభాతవార్త:** పాలమూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసదేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతామని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తెలంగాణ చౌరస్తా నుంచి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడానికి ప్రయత్నించగా కార్యాలయ సమీపంలో పోలీసులు భారీకెడ్లు ఏర్పాటు చేశారు. భారీకేడ్డు దాటి కాంగ్రెస్ నాయకులు వెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం మీడియాతో డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గట్టిగా ప్రస్తావిస్తున్న కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్గాంధీపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ అనేది కేవలం జర్నలిజంకు సంబంధించినదని అన్నారు. సోనియాగాంధీ,రాహుల్ గాంధీపట్ల బీజేపీ అవలంభిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.నిరసనలో ముడా చైర్మన్‌లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లునర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, నాయకులువినోద్ కుమార్, మిథున్‌రెడ్డి, సీజే బెనహర్,అజ్మత్ ఆలీ, బెక్కరి మధుసూదన్ రెడ్డి ఫయాజ్, ఆవేజ్, రాములు యాదవ్, నాగరాజు, ప్రవీణ్ కుమార్‌తో పాటు జిల్లాలోని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నూతనంగా గెలుపొందిన గ్రామ పంచాయతీల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పోరులో విజయం సాధించిన బీసీలకు అభినందనలు

**- బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్ సాగర్**

**మహబూబ్‌నగర్, డిసెంబర్18, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన బీసీ సర్పంచులకు, ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ శుభాకాంక్షలు తెలియజేశారు. బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యాలయంలో బీసీ సమాజ్ బాధ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీ భావజాలం గ్రామ గ్రామాన,వాడవాడలా విస్తరించేలా బీసీ కుల సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలపోరాటాల ఫలితంగా మూడు విడతల్లో జరిగిన పల్లెపోరులో ఘన విజయం సాధించటం తో పాటు జనరల్ స్థానాలలో 50 శాతానికి పైబడి విజయం సాధించిన బీసీ సర్పంచులకు,వార్డు మెంబర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రభుత్వం బీసీలను మోసం చేస్తూ 42 శాతం ఇస్తామని ప్రకటించి 17శాతం ఇచ్చినఈరోజు 50 శాతానికి పైబడి గెలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో బీసీల గెలుపులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో జరగబోవు ఎంపీటీసీ ,జడ్పీటిసి ఎన్నికల్లో అన్ని పార్టీలు ఎక్కువ సీట్లు ఇవ్వాలని లేనిపక్షంలో సర్పంచ్ ఎన్నికల తరహాలోనే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లో కూడా బీసీలు తమ ప్రతాపాన్ని చూపెట్టి అత్యధిక స్థానాలు గెలుపే ధ్యేయంగా ముందుకు వెళ్లి తమ బలాన్ని అన్ని పార్టీలకు చూపెట్టి బీసీల రాజ్యాధికార దిశగా ముందుకు వెళ్తామని శ్రీనివాస్ సాగర్ అన్నారు.కార్యక్రమంలో బీసీ సమాజ్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలమూరువెంకటేష్‌గౌడ్, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ బి శేఖర్, బీసీ సమాజ్ మహబూబ్ నగర్ నియోజకవర్గ కన్వీనర్ చిట్లపల్లి దుర్గేష్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షునిగా ఎనుముల సాయినాథ్ రెడ్డి

**జడ్చర్ల, డిసెంబర్ 18,ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంస్థల విభాగాల బలోపేతంలో భాగంగా పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షునిగా ఎనుముల సాయినాథ్ రెడ్డి ని నియమించిన విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు నవీన్ చంద్ర రెడ్డి. ఈ మేరకు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా వారి నివాసంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన కార్యవర్గం విద్యా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నవీన్ చంద్ర రెడ్డి, మాజీ వైస్ చైర్మెన్ కోడ్గల్ యాదయ్య, పట్టణ అధ్యక్షులు పిట్టల మురళి, శ్రీకాంత్, విద్యార్థి విభాగం నాయకులు వినయ్ ముదిరాజ్, శివ, తిరుపతి, వెంకట్,ఇసాక్, షాజిబ్ తదితరులు పాల్గొన్నారు.

# జనావాసాల్లోని కోతులు వనాల్లోకి

- **నియంత్రణ చర్యలు చేపట్టిన కొత్త సర్పంచ్**
- **కోతుల బెడద ఉండదిక అంటూ హామీ**

**బిజినపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** చాలా ఏళ్ల నుంచి సమస్యగా మారిన కోతుల బెడద తీరుస్తామని పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు నియంత్రణ చర్యలు చేపట్టారా కొత్త సర్పంచ్. మమ్మాయిపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ ఏటవాళి సరోజినమ్మ నియంత్రణ చర్యలు చేపట్టారు. తిరుపతికి చెందిన దేవ స్థానం బృందానికి కాంట్రాక్ట్ పద్ధతిన కోతికి రూ.900లు చెల్లించి గ్రామంలో కోతుల బెడద తీర్చే పనిలో పడ్డారు. గ్రామ సర్పంచ్ ఏటవాళి సరోజినమ్మ మాట్లాడుతూగతంలో గ్రామంలో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి చేసేవని, ఇళ్లు, దుకాణాల్లో తినుబండారాలు, వస్తువులను ఎత్తుకెళ్లేవని చెప్పారు. కూరగాయలు, పండ్ల చెట్లను ధ్వంసం చేసేవని, కోతుల భయంతో ప్రజలు ఆందోళన చెందేవారన్నారు.ఇళ్లలోని ఆహార పదార్థాలు వస్తువులు చిందర వందర చేస్తు, కిరాణ షాపులు, దుకాణాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, కోతుల భయంతో షాపులోని వస్తువులకు రక్షణగా జాలీలను ఏర్పాటు చేసుకున్నారని వివరించారు. కోతుల బెడదతో పెంకుటిళ్లు, రేకుల ఇళ్లు ధ్వంసం అయ్యాయని, ఆరు బయట ఎండబెట్టిన పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాలనూ కోతులు వదల లేదు అన్నారు. ఇళ్లలో ఉన్న మామిడి, జామ, బొప్పాయి,ఇతర పండ్ల చెట్లు, కూరగాయల చెట్లను, పంటలనూ కోతులు వదలకుండా ధ్వంసం చేశాయని ,కోతుల సమస్య తీరుస్తామని పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జనావాసాల్లోని కోతులు వనాల్లోకి పంపేందుకు చర్యలు చేపట్టి కోతులను బందించి అటవీ ప్రాంతాలకు తరలించనున్నట్లు తెలిపారు. నియంత్రణ చర్యలు చేపట్టిన కొత్త సర్పంచ్ ఏటవాళి సరోజినమ్మ, ఎటవాలి రాజ వర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ కదిరే రాములుకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కోతులను బంధిస్తున్న ప్రత్యేక బృందం



ఏటవాళి సరోజనమ్మ, కొత్త సర్పంచ్

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన గ్రామాలలో గెలిచిన కొత్త సర్పంచులు

**ఇటిక్యాల డిసెంబర్ 18, ప్రభాతవార్త:** ఉమ్మడి ఇటికాల మండలంలో బుధవారం జరిగిన మూడో విడతలో సర్పంచ్ వార్డు మెంబర్లకు ఎన్ని కలు జరిగాయి. బుధవారం కౌంటింగ్ కొనసాగి ఫలితాలు ప్రకటించారు. దీంతో గురువారం శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను గెలిచిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు. వార్డు మెంబర్లు ఉప సర్పంచులు. గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి త్వరలో వెళ్లి ఆయనను కలిశారు. అదేవిధంగా పలువురు ఇండిపెండెంట్ లుగా గెలిచిన సర్పంచ్ అభ్యర్థులు ఆయనను కలిసి పార్టీలోకి చేరారు.వల్లూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ రెబల్ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన రవిప్రకాష్ సర్పంచ్‌గా గెలుపొందారు. ఈ సందర్భంగా గురువారం శాంతినగర్‌లోని క్యాంపు కార్ యాలయంలో సర్పంచ్ రవిప్రకాష్ ఉప సర్పంచ్ కిషోర్‌కుమార్ వార్డు నెంబర్లు గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గా గెలిచిన రవి ప్రకాష్. ఉపసర్పంచ్.వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారిని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పార్టీలోకి ఆహ్వానించి అభినందనలు తెలిపారు. అలాగే పెద్దదిన్న సర్పంచ్ గారు గెలుపొందిన గొల్ల సుజాత. ఉపసర్పంచ్ కే నవిత. వార్డు మెంబర్లు. ఆ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి. మాజీ ఎంపిటిసి సోమిరెడ్డి. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలు కలిసి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను కలవగా వారిని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. శనగపల్లె సర్పంచ్‌గా గెలుపొందిన చిట్టెమ్మ రామాంజనేయులుగౌడ్. మరియు ఉప సర్పంచ్. వార్డు మెంబర్లు ఆ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రుక్మానందరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారిని సత్కరించి అభినందించారు.అలాగే ఎర్రవల్లి. మానవపాడు. ఉండవెల్లి. అల్లంపూరు మండలాల నుండి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల సర్పంచులుగా గెలుపొందగా ఆ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్‌లో వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను కలిశారు. 5 మండలాల నుండి గెలిచిన సర్పంచులు ఉప సర్పంచులు వార్డ్ మెంబర్లు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను కలిసేందుకు శాంతినగర్ క్యాంపు కార్యాలయానికి చేరుకోవడంతో క్యాంపు కార్యాలయం మొత్తం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సందడిగా నెలకొంది.



మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన రవి ప్రకాష్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు



పెద్దదిన్నె సర్పంచ్. ఉప సర్పంచ్‌ను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

## బిజెపి కార్యాలయం ముట్టడి కాంగ్రెస్ పార్టీ అనైతికం

- **అధికార పార్టీ అశాంతికి ఆజ్యం పోస్తుంది**
- **శాంతి భద్రతలకు విఘాతం**
- **బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్ ఆరోపణ**

**వనపర్తి, డిసెంబరు18 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోని యాగాంధీతో పాటు రాహుల్ గాంధీ పై నమోదైన హెరాల్డ్ కేసు ఢిల్లీ హైకోర్టు కొట్టేసినంత మాత్రాన వనపర్తి జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు క్రమశిక్షణ కలిగిన నాయ కుడు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ బిజెపి కార్యాలయం ముట్టడించడం ఎంతవరకు సమంజసం అని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సీనియర్ న్యాయవాది మున్నూరు రవీందర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. గురువారంవనపర్తి జిల్లా బిజెపి కార్యాలయాన్ని ముట్టడిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత ఎమ్మెల్యే మెగారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డితో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనారెడ్డితో పాటు మరికొంతమంది కార్యకర్తలు ఒక్కసారిగా బిజెపి కార్యాలయం వైపు దూసుకొని పోవడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు.ఈ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవలసిన బాధ్యత గల ప్రభుత్వమే ఈ విధంగా కార్యాలయాలపై ముట్టడించడం నిరసన తెలపడం రాజ్యాంగానికి చట్టాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసు న్యాయస్థానంలో కొట్టివేస్తే కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ ఎందుకు బిజెపి కార్యాలయాల ముందు ఎందుకు నిరసన తెలుపుతుందని దానికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల చుట్టూ స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తే ఆ పార్టీ నాయకులు చూస్తూ ఊరుకుంటారా అని ఆయన ప్రశ్నించారు. మీ కార్యాలయాలు ముట్టడిస్తే ఒకన్యాయం ఇతరుల పార్టీ కార్యాలయాలు ముట్టడిస్తే మరొక్క న్యాయం ఇది కాంగ్రెస్ పార్టీకి తగునా అంటూ ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన కేసు ఇప్పుడు కొట్టివేసినంత మాత్రాన కాంగ్రెస్‌పార్టీ సంకలు సంకలు గుద్దుకుంటుందని ఆయన ఎద్దేవా చేశారు. న్యాయస్థానంలో సరైనసాక్ష్యాలు లేనప్పుడు కేసు కొట్టివేయడం సర్వసాధారణం అయినప్పటికీ దాని కాంగ్రెస్‌పార్టీ ఆర్భాటం హంగామా సృష్టించడం భావ్యం కాదని అన్నారు. వనపర్తిలో బిజెపి కార్యాలయం ముట్టడి తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి అనైతిక చర్యలకు ఏ పార్టీ కూడా మద్దతు తెలుపవద్దని ప్రతి ఒక్కరు దీని ఖండించాలని ఆయన డిమాండ్ చేశారు.



## 21న జాతీయ మెగా లోక్‌అదాలత్

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- రాజీ మార్గమే రాజ మార్గం
- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్18, ప్రభాతవార్త:** డిసెంబర్ 21న జరగ నున్న జాతీయ మెగా లోక్‌అదాలత్ ను ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. క్షణికావేశంలో జరిగిన తప్పులను సరిదిద్దు కోవడానికి లోక్‌అదాలత్ ఒక ఉత్తమ అవకాశ మని, రాజీకి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో కక్షిదారులు పరస్పర సమ్మతితో రాజీ పడవచ్చని పేర్కొన్నారు. అనవసర గొడవల వల్ల జీవితాలు ఇబ్బందుల పాలవకుండా, రాజీ ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్టే అవుతాయని అన్నారు.రాజీకి అర్హమైనకేసుల్లో ప్రత్యేక దృష్టి - అధికారులకు సూచనలుఈ నెల 21 (ఆదివారం) జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్ లో భాగంగా, జిల్లా వ్యాప్తంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ మరియు వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి రాజీకి అర్హమైన అన్ని కేసుల్లో ఇరు వర్గాల సమ్మతితో రాజీ కుదిరేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలు మరియు కోర్ట్ డ్యూటీ అధికారులను ఎస్పీ ఆదేశించారు.అదేవిధంగా సైబర్‌నేరాల విషయంలో, మోసగాళ్ల చేతి లో బాధితులుకోల్పోయిన డబ్బులు వీలైనంత త్వరగా బాధితులకు అందేలా చూడాలని, రూ.25,000 కంటే తక్కువ మొత్తం కోల్పోయిన కేసుల్లో లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదు స్వీకరించి, ఎఫ్ఐఆర్ లేకుండానే రీఫండ్ ప్రక్రియ చేపట్టాలనిసూచించారు.జాతీయ మెగాలోక్‌అదాలత్ విజయవంతం కావాలంటే అధికారులు నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించి, రాజీ పడదగిన అన్ని కేసుల్లో ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి, సాధ్యమైనంత ఎక్కువ కేసులు రాజీ పడేలా కృషి చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు.శిలిపీ

## మహబూబ్‌నగర్‌లో ఎఫ్‌ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌రిజిస్ట్రేషన్ మేళా

**మహబూబ్‌నగర్, డిసెంబర్18,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు) కోసం ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ , రిజిస్ట్రేషన్ మేళా డిసెంబర్ 19, 2025 నాడు నిర్వహించనున్నట్లు జిల్లా ఆహార తనిఖీ అధికారి నీలిమ తెలిపారు.ఈ మేళా మహబూబ్‌నగర్ నందు ఇంటిగ్రేటెడ్ జిల్లా కార్యాలయ సముదాయం గది నెం.218లో,ఉదయం 11.00 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించబడుతోందనీ తెలిపారు. ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు పొందడం లేదా రెన్యువల్ చేసుకోవాలని ఆమె సూచించారు. ఇతర వివరాల కొరకు సంప్రదించవలసిన మొబైల్ నంబర్లు: 8121259373, 701348373 సూచించారు.

## సర్పంచు ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు : మాజీ మంత్రి

**వనపర్తి, డిసెంబరు 18 ప్రభాతవార్త:** మూడవ విడత సర్పంచ్ ఎన్నికలలో గెలుపొందిన విజేతలు 12 మందిని, మల్దకల్ మండలం నాగర్‌దొడ్డి సర్పంచి నాగర్‌దొడ్డి వెంకటేశ్వరమ్మ సత్తెన్నను గురువారం మాజీమంత్రి నివాసంలో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా ఎన్నికలలో వీరోచితంగా పోరాడి అధికార పార్టీకి ధీటుగాసమాధానం చెప్పిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమములో నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్‌రెడ్డి, హేమంత్ ముదిరాజ్,జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, పటేల్ జనార్ధన్‌రెడ్డి, జార్జ్,కిరణ్,యోసేపు,మోహన్‌గౌడ్, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో క్రీడలకు కర్ని విద్యార్థి శివాని ఎంపిక

**మక్తల్ టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** గత నవంబర్ 23 నుండి 25 వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పంతంగి, యాదాద్రి భువనగిరి జిల్లా లో జరిగిన స్కూల్ గేమ్స్ 17 సంవత్సరాలలోపు ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలికల ఖోఖో జట్టు తరఫున, నారాయణపేట జిల్లా మక్తల్ మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కర్ని విద్యార్థిని ఎన్. శివాని పాల్గొని, ఉత్తమ క్రీడా ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వెంకటయ్య, కోచ్ ఫిజికల్ డైరెక్టర్ బి.రూపతెలిపారు. జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన యన్. శివాని ఈనెల 20 నుండి 24 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలోజరిగే 69వ జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటుందని ఫిజికల్ డైరెక్టర్ బి. రూప తెలిపారు. జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన శివానిని, అందుకు కృషి చేసిన పిడి, బి.రూపను రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాఘవరెడ్డి, నేతి కృష్ణమూర్తి, అడ్వైజర్ బి.గోపాలం ,ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఒబెదుల్లా కొత్వాల్, విలియం,పాఠశాలప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ సర్పంచ్ ,వార్డు సభ్యులు గ్రామస్తులు అభినందించారు.

## నేటి నుంచి జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్

**- నాగసాల మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహణ**

**జడ్చర్ల, డిసెంబర్ 18,ప్రభాతవార్త:** తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలవిద్యార్థిని, విద్యార్థులకు జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ -2025 బాలుర క్రీడలు జడ్చర్ల సమీపంలోని నాగసాల వద్ద ఉన్న తెలంగాణ మైనారిటీగురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని డీఎల్‌సీ ఖాజ బహోద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఈనెల 21వరకు పోటీలు ఉంటాయని తెలిపారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో మొదలైన క్రీడలు నిర్వహించడం జరుగుతుందని, ముఖ్య అతిథిగా క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు అనిరుధ్ రెడ్డి యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్ ఇతర జిల్లా అధికారులు హాజరవుతారని తెలిపారు.

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే రాజకీయాలు మాట్లాడుకోవాలని మిగతా మయంలో గ్రామాల అభివృద్ధి కోసం రాజకీయ పార్టీల కతీతంగా ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించుకోవాలని ఆయన హితోపలికారు.ఇదే స్ఫూర్తితో రాబోయే మున్సిపల్ మరియు ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలలో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమానికి ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా అధ్యక్షత వహించగా మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు తులసిరాజు యాదవ్ ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షులు పరమేష్ పట్టణ పార్టీ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు వనపర్తి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్‌గౌడ్‌తో పాటుగా కాంగ్రెస్ నాయకులు వెంకట నరసింహారావు, గాలి పంపు శ్రీనివాసులు, అక్షర స్కూల్ దామోదర్, మహమ్మద్ రఫీక్, వెంకటేష్, తదితరులతోపాటుగా పలువు నాయకులు పాల్గొన్నారు.

## ఇటిక్యాల మండల ఉప సర్పంచ్‌ల ఎన్నిక

**ఇటిక్యాల డిసెంబర్ 18, ప్రభాతవార్త:** ఇటిక్యాల మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వావిలాల మొగలిరావల్ చెరువు గ్రామాలలో సర్పంచ్ వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం 12 గ్రామాలకు సర్పంచ్ వార్డు మెంబర్లకు ఎన్నికలు జరగగా మధ్యాహ్నం అనంతరంప్రిసైడింగ్ అధికారులు సర్పంచ్, వార్డు మెంబర్లుకు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించారు.బుధవారం ఎన్నికలు జరిగిన12 పంచాయతీలలో 8గ్రామ పంచాయతీలకు వార్డ్ మెంబర్లలో ఒకరిని ఉపసర్పంచ్‌గా ఎన్నిక చేశారు. గురువారం పెండింగ్ లో ఉన్న సాతర్ల, ఉదండాపురం, గోపాల్ దిన్నె, ఇటిక్యాల పంచాయతీలలో ఉపసర్పంచులను ప్రిసైడింగ్ అధికారులు సమావేశపరిచి ఎన్నిక పూర్తి చేసినట్లు ఎంపీడీవో మహమ్మద్ అజార్ మొహియుద్దీన్, ఎంపీవోసునీల్‌తెలిపారు.ఎన్నికైన ఉపసర్పంచ్‌లు ఉదండాపురంలో జే.యుగంధర్, బుద్దారెడ్డిపల్లిలో గౌని సువర్ణమ్మ, గోపాల్‌దిన్నె మరియమ్మ, నక్కలపల్లి కె.రామాంజలి,శనగపల్లి బి. పావని, మునగాల పుణ్యవతి,ఇటిక్యాలనాగరాజు, సాతర్ల మహమ్మద్,షాబాద్ బి.పరశురాముడు,పెద్దదిన్నె కె.నవిత,చాగాపురం కే. పరశురాముడు, శివ్వన పల్లి వడ్డే పద్మమ్మ, వావిలాల కృష్ణ,మొగలి రావాల్ చెరువు కె.రాణి మండలంలో 14పంచాయతీలలోకొత్తగా ఉపసర్పంచులుగా ఎన్నికైనట్లు ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్ ఎంపీవో సునీల్ తెలిపారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని కలిసిన మాజీ యూత్ ప్రెసిడెంట్

**దేవరకద్ర, డిసెంబరు 18 ప్రభాతవార్త:** జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, సన్మాన కార్యక్రమంలో దేవర కద్ర మున్సిపాలిటీ మాజీ యూత్ అధ్య క్షులు అర్జునచారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లాడుతూ యువత విద్యా ,ఉపాధి రంగాల్లో ముందుకు రావాల్సిన అవ సరం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య మరియు ఉపాధి, అవకాశాలను మెరుగుపరచడానికి కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపుదల వంటి డిమాండ్ల తో కాంగ్రెస్ పార్టీ విద్యా ఉపాధి రంగాల కార్యాచరణకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

## నూతన సర్పంచులను సన్మానించిన బీజేపీ కార్యవర్గ సభ్యులు కొండయ్య

**మక్తల్ టౌన్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** ఉప్పరపల్లి గ్రామం నుండి మిత్రపక్షం తరఫున కొత్తగా సర్పంచ్‌గా ఎన్నికైన రవితేజతో పాటు పంచాయతీ సభ్యులు, ఉప సర్పంచ్‌ను బీజేపీ కార్యవర్గ సభ్యులు కొండయ్య సన్మానించారు. అలాగే బిజ్వార్ గ్రామం నుండి బీజేపీ తరఫున సర్పంచ్‌గా గెలుపొందిన అభ్యర్థి, పంచాయతీ సభ్యులు, సామాన్‌పల్లి గ్రామం నుండి బీజేపీ తరఫున గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థి, పంచాయతీ సభ్యులు, ఉపసర్పంచ్‌ను కూడా సత్కరించారు. ఈ కొత్తగా గెలుపొందిన ప్రజాప్రతి నిధులందరినీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కొండయ్య శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, బీజేపీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచును సన్మానించిన మంత్రి

**మక్తల్ టౌన్, డిసెంబరు18 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణములోని ద్వారకా ఫంక్షన్ హాల్‌లో గురువవారం జరిగిన సర్పంచ్, వార్డ్ సభ్యుల సన్మాన కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. సంగం బండ గ్రామ సర్పంచ్ గవినోళ్ల సుమిత్రమ్మ, ఉప సర్పంచ్ ఎం.సురేష్ వార్డ్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీకెఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ల బాలకిష్టరెడ్డి,ఏఎంసి ఛైర్ పర్సన్ రాధా,మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి,బాలచందర్‌రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపొందిన గ్రామ సర్పంచ్ అభ్యర్థులు

**శ్రీరంగాపూర్, డిసెంబరు18 ప్రభాతవార్త:** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శ్రీరంగాపురం మండలంలో 85.9 శాతం పోలింగ్ నమోదు కావడం జరిగింది.1) మద్దిలేటి శ్రీరంగాపూర్ 1085 మెజార్టీతో ( కాంగ్రెస్) 2) విజయ్ కుమార్ రెడ్డి కంబాలాపూర్ 88 మెజార్టీతో (టిఆర్ఎస్) 3) వెంకటయ్య నాయుడు షేర్ పల్లి 17 ఓట్ల మెజార్టీతో( కాంగ్రెస్) 4) గుంటి మహాదేవ్ నాగరాల 117 ఓట్ల మెజార్టీతో( కాంగ్రెస్) 5) ముంత శిరీష తాటిపాముల 120 ఓట్ల మెజార్టీతో (స్వతంత్ర అభ్యర్థి ) 6) సుజాత నాగసానిపల్లి 172 ఓట్ల మెజార్టీతో ( స్వతంత్ర అభ్యర్థి ) 7) సుర గౌని భారతి వెంకటాపూర్ 429 ( కాంగ్రెస్) 8) వీరపాగ రాముడు జానంపేట 389 ఓట్ల మెజారిటీ (స్వతంత్ర అభ్యర్థి ) అభ్యర్థులు సర్పంచులుగా గెలుపొందడం జరిగింది.

## భక్తిశ్రద్ధలతో ఘిలాఫ్ ముబారక్

**జడ్చర్ల,డిసెంబర్18,ప్రభాతవార్త:** హజ్రత్ సయ్యద్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తీ అజ్మేరీ (గరీబ్ నవాజ్ సర్కార్) 815వ ఉర్స్ షరీఫ్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఆరోగ్య మంత్రి, మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి నివాసం నుండి గురువారం భక్తిశ్రద్ధలతో ఘిలాఫ్ ముబారక్‌ను రవాణా చేశారు. ఘిలాఫ్ ముబారక్ రవాణాకు ముందు మహ్మద్ సుల్తాన్ చిష్తీ మర్జాయి ప్రత్యేక దువా, ఫాతిహా పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శాంతి, ఐక్యత,సుఖసమృద్ధులు కలగాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మహ్మద్ అలీ దానిష్,పి. మురళి,తొలి ముడా డైరెక్టర్ లు శ్రీకాంత్, ఇంతియాజ్ అబ్దుల్ ముకీత్, ఖ్వాజా ఇమ్తియాజ్, అజీర్‌ద్దీన్, అయూబ్, మహ్మాద్, తదితరులతో పాటు స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గరీబ్ నవాజ్ సర్కార్ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో గరీబ్ నవాజ్ సర్కార్ బారగాహ్‌లో ఉర్స్ ఉత్సవాలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## ధాన్యం మిల్లుకు రవాణా చేయాలి

**జడ్చర్ల, డిసెంబర్18,ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యంను వెంటనే మిల్లుకు రవాణా చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లాలో ఇప్పటివరకు 191వరి ధాన్యం కొనుగోలు సెంటర్ల ద్వారా లక్షా6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుండి కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. సుమారు 260కోట్ల విలువైన ధాన్యం సేకరించగా ఇప్పటి వరకు 219 కోట్ల రూ.లు రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు మిగిలిన 40 కోట్ల రూ.లకు సంబంధించి ట్యాబ్ ఎంట్రీ పెండింగ్ వెంటనే పూర్తి చేసి చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఐ.కె.పి,పి.ఏ.సి.ఎస్ ఏజెన్సీ లను ఆయన ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి,పౌర సరఫరాల సంస్థ డి.ఎం లను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆయన ఆదేశించారు. కొనుగోలు సెంటర్లలో గలధాన్యమును వెంటనే తూకం వేసి మిల్లర్లకు లారీల ద్వారా పంపించే ఏర్పాట్లు చేసి ఎక్కడ ఎటువంటి జాప్యం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు సమావేశం లో డిఆర్‌డిఓ నర్సింహులు, పౌర సరఫరాల సంస్థ డి.ఎం.రవినాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి టైటస్ పాల్, జిల్లామార్కెటింగ్ అధికారిని బాలమణి, వ్యవసాయ శాఖ ఏ.డి.హైమావతి,ఎన్ఫోర్స్ మెంట్ డి.టి.లు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.